కథా కౌముది

# కొత్త చిగుళ్ళు

కామరాజుగడ్డ వాసవదత్త రమణ

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
## సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

'విమానాశ్రయంలో నిన్ను చూడగానే చాలా ఏడుపొచ్చేస్సిందక్కా. అమ్మ,నాన్న ఉండగా తప్పనిసరిగా ప్రతి ఏడాది యూకె నుంచి ఇండియా వచ్చి వెళ్ళేదానివి.' టీ కప్పు ఇచ్చి నా పక్కగా సోఫాలో కూర్చుంటూ అంది మమత.

'మళ్ళి రావడానికి ఇన్నేళ్ళు పట్టింది అంటే నాకే ఆశ్చర్యం వేస్తోంది' అన్నాను నేను.

టీ తాగుతూ మా తమ్ముడు రామకృష్ణ మా సంభాషణ అంతా వింటున్నాడు కాని ఏమి మాట్లాడలేదు.నేను తీసుకొచ్చిన బహుమతులు మా మరదలు శ్యామలకి వివరంగా చూపిస్తూ పిల్లలు స్వాతి,సూర్య తెగ సంబరపడిపోతున్నారు.

'పూలదండలా కలిసిఉన్న మన ముగ్గురము అమ్మ,నాన్న చనిపోవడంతో విడిపూలులాగా ఒక్కసారిగా చెదిరిపోయాము.అదొక్కటే నన్ను చాలా బాధపెట్టింది'. అంది మమత.

'ఎవరివాళ్ళు తమ సంసారభాధ్యతలలో కూరుకుపోయి అనుభంధాలను మరిచిపోతే మరి విడిపోమా ఏంటి?' రామకృష్ణ గంభీరంగా అన్నాడు.ఆ మాటలు నన్ను బాకుల్లా గుచ్చుకున్నాయి.

చిరునవ్వును ముఖానికి పులుముకుంటూ

'పిల్లలు బాగా పొడవైయ్యారు.సూర్య అయితే అచ్చుగుద్దినట్లు నాన్న ముఖమే' వాడివంక పరిక్షగ్గా చూస్తూ అన్నాను.

'రూపం ఒక్కటే కాదు వదిన.మావయ్యగారి లాగే బంధువుల పట్ల అభిమానాలు ఎక్కువే.' శ్యామల నవ్వుతూ అంది.

ఇంతలో మమత కూతురు రచన లొపలికి వస్తూ ,

'దొడ్డా,నువ్వు మా ఇంటికి వచ్చి అప్పుడే రెండు రోజులు అయింది.ఇక తీసుకున్న రెస్ట్ చాల్లే.మళ్ళీ నెలలోపే నీ తిరుగు ప్రయాణం పెట్టేసుకున్నావు కూడాను.నేను నాలుగు రోజులు సెలవు పెట్టేసాను.శనివారం,ఆదివారం వీక్ ఎండ్స్.మావయ్యవాళ్ళు కూడా ఇక్కడే ఉన్నారు కదా.వారంరోజులు హాయిగా ఎంజాయ్ చేద్దాం.కారులో ఫుల్ ట్యాంక్ పెట్రోల్ కొట్టించేసాను.ఎక్కడికి వెళదాం చెప్పు?' హుషారుగా అంది.

దాని వంక మురిపెంగా చూస్తూ, 'నీ ఇష్టం ఎక్కడికయినా ఒకే కాని ముందు ఒకసారి తాతగారి ఊరుకి వెళ్లివద్దాం' అన్నాను.

'ఏంటీ?ఆ ఊరికా?అమ్మో,చాల బోరింగ్ ప్రోగ్రాం పెడుతున్నావు.అయినా మావయ్య వాళ్ళు ఆ ఊళ్ళో ఇల్లు అమ్మేసి,ఇక్కడే సెటిల్ అయ్యారుగా.ఇంకేవుంది చూడటానికి?' ఆశ్చర్యంగా అంది.

'మేము పుట్టి పెరిగిన మా ఇల్లు' అన్నాను.

శ్యామల చటుకున్న తలెత్తి నా వంక  చూసింది.రామకృష్ణ కళ్ళలోనూ రకరకాల భావాలు కదలాడాయి.

'మా చిన్నతనపు తీపి జ్ఞాపకాలు,మా అమ్మ నాన్నల ప్రేమలు,మా అక్క చెల్లెళ్ళ గిల్లి కజ్జాలు,తమ్ముడితో ఆడిన ఆటలు,మా అల్లర్లు ఇలాంటి అనుభూతులెన్నో ఆ ఇంటితో ముడిపడి ఉన్నాయి.ఒక్కసారి మా ఇంటిని చూడాలని ఉంది.'దూసుకువస్తున్న జ్ఞాపకాల దొంతరలను,మనస్సులో మెదులుతున్న భావనల ముంపును అదిమిపెడుతూ అన్నాను.

నా భుజం మీద చేయి వేసి,'అలాగే వెళదాంలే వదిన.అటునించి అందరమూ కలిసి మన ఇంటికి వెళ్లిపోదాం' అంది శ్యామల.

'మన' అన్న మాటకు ఆమె కేసి ఆర్ద్రంగా చూసాను.

'సరే,మీ మెజారిటీ పెరిగిందిగా.కానివ్వండి' రచన నవ్వుతూ అంది.

★★★

మా నాన్న ప్రభుత్యోగి. అయన పంతొమ్మిదవ ఏటే ఈ ఊర్లో ఉద్యోగంలో చేరి ఇక్కడే స్థిరపడి పోయారు. మాది ఊరు చివర ఇల్లు. పక్కనే ఉన్న ఖాళి స్థలంలో అమ్మా నాన్నా అన్ని రకాల కూరలు పండించేవారు. మా బాల్యమంతా మేము ముగ్గురం ఆడింది ఆటగా,పాడింది పాటగా సాగింది. అసలు మమ్మల్ని అమ్మ నాన్నా అలాగే పెంచారు అంటేనే సరి ఏమో.

అమ్మ గృహిణి,చక్కటి గాయని కూడా. ఏం పని చేస్తున్నా ఏదో ఒక కీర్తన పాడుతూ చకచకా పూర్తి చేసేసేది. అలా మాక్కూడా అలవాటైపోయింది

ఇది పెద్ద పని,ఇది చిన్న పని,ఇది కష్టం,అన్న మాటే లేదు.ఏం చెబితే అది చేసేయడమే. ఏం పెడితే అది తినేయడమే.ఏ పనైనా అందుకోవడమే. అంతా కలిసి మెలిసి హాయిగా ఉండటమే,ఇది లేదు అది సరిపోలేదు అన్నదే లేదు.ఉన్నదంట్లో తృప్తి పడిపోవడమే. అమ్మ ,నాన్న మాకు నేర్పిన జీవిత పాఠం అదే.

ప్రతీ వేసంగి సెలవల్లో నానమ్మ ఊరుకి వెళ్ళేవాళ్ళం.మా నానమ్మ వాళ్ళింట్లో వారంరోజులు,మా అమ్మమ్మ వాళ్ళింట్లో వారం రోజులు ఉండి,నాన్న తిరిగి ఉద్యోగానికి వెళ్లిపోయేవాళ్లు.అమ్మ నెల్లాళ్ళకు పైగానే అమ్మమ్మ ఇంట్లో ఉండిపోయేది.అమ్మమ్మ వాళ్ళు ఏడాదికి సరిపడా ఊరగాయలు,పప్పులు అన్ని సర్ది అమ్మకిచ్చి పంపించేవాళ్ళు.

మళ్ళి జూన్లో మా బళ్ళు తెరిచేటప్పటికి నాన్న మళ్ళి ఊరు వచ్చి మమ్మల్ని తీసుకొని వెళ్ళేవాళ్ళు.కానీ మేం కొద్దిగా పెద్దవాళ్ళమైయాక నాన్న తిరిగి తీసుకురావటానికి రావడం మానేసారు. సెలవలు అయ్యాక అమ్మని మావయ్యవాళ్ళు రైలెక్కిస్తే,మేం నలుగురం కలసి రైల్లో వచ్చి అక్కడ్నుంచి బస్సులో మా ఇంటికి వచ్చేసేవాళ్ళం.

అందుకే ఎప్పుడైనా గుర్తు చేసుకుంటే మా ఇల్లు,అమ్మమ్మ వాళ్ళ ఇల్లు ఈ రెండు కూడా నా కళ్ళ ముందు మెదులుతూ ఉంటాయి. ఇప్పుడు పెద్దవాళ్ళందరూ కాలం చేసారు. మామయ్యల ఇంట్లో శుభ కార్యాలకి కొన్నింటికీ రామకృష్ణ మొక్కు బడిగా హాజరు అవుతే, మమత మటుకు బాంధవ్యలకు విలువనిస్తూ ప్రతి కార్యక్రమానికి మానకుండా వెళుతుంది.అంతే కాకుండా అందరి బాగోగులు గురించి తరచుగా కనుక్కుంటుంది.

మాకు కూడా ఇక్కడ ఇల్లు, పొలాలు ఉన్నా,ఒక్కడే కావడంతో మేము యుకె లో మావాడి దగ్గరే స్థిరపడిపోదామన్న ఆలోచనతో అక్కడే ఎక్కువగా ఉంటున్నాము.

అమ్మ నాన్న ఒక ఏడాదిలోనే ఒకరి వెంట మరొకరు వెంటవెంటనే చనిపోవడం,వ్యాపారనష్టం రావడంతో మా అందరి ఆరోప్రాణంలాంటి ఇంటిని అమ్మేయాలన్న రాము నిర్ణయం వల్ల మా మధ్య అనుబంధాల్లో సన్నని బీటలు వచ్చాయి. ఇల్లు అమ్మకం అన్నది ఎవ్వరము జీర్ణం చేసుకోలేకపోయాము.కాని వాడికి వేరే మార్గం దొరకలేదు. కుములుతున్న నా మనసుకి సర్ది చెప్పుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది.మేము జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ మాటల్లో పడి,మా ఊరు ఎప్పుడు చేరామో మాకే తెలియలేదు.

★★★

'దొడ్డా,ఇల్లంతా బాగా పాడైపోయింది కదా,'మా ఇంటి పక్కనే కారుని ఆపుతూ రచన అంది. ఇంటి వంక చూస్తూ కళ్ళ చివర చెమ్మ చేరుతుండగా కారు దిగాను. ఇల్లు కొన్నవాళ్ళు చిన్నప్పటినుంచి మాకు తెలిసిన మా ఊరి రామన్నచౌదరి కుటుంబంలోని వాళ్ళే. కాసేపు కబుర్లు అయ్యాక ఇంటి వెనక తోటలో వెళ్ళాము.

'ఆఫీస్ నుంచి రాగానే నాన్నకి చెప్పడానికి అమ్మ దగ్గర ఎన్ని కబుర్లు ఉండేవో కదా. ఇవాళ ఇంట్లోకి అడుగు పెడుతుంటే, నాన్నకి అన్నం వడ్డిస్తూ పక్కగా కూర్చుని అమ్మ ఆవేళ్టి ఇంటి విషయాలు,చుట్టూ పక్కల వాళ్ళ కబుర్లన్నీ పూసగుచ్చుతున్నట్టు చెబుతునట్టుగా నాకనిపించింది.' మమత మాటకు చిన్నగా నవ్వాను.

స్వాతి,సూర్య చెట్టు నించి జామకాయలు కోసుకుంటుంటే,

'ఒరేయ్,ఇటు చూడండి.గుర్తు పట్టారా.అది నేను పుట్టినప్పుడు మీ నానమ్మ నాటిన చెట్టురా' కొబ్బరిచెట్టు మానుని ఆప్యాయంగా తడుముతూ అన్నాడు రామకృష్ణ.

గుర్తులు చెరిగిపోతాయేమో కాని జ్ఞాపకాలు చెదిరిపోవు కదా. వాడి ముఖంలోను తెలియని బాధ కనిపించింది.

'అమ్మ,నాన్న రూపాయి రూపాయి కూడబెట్టుకొని కట్టుకున్న ఇల్లు,మనల అల్లారు ముద్దు  పెంపకాలు, చదువు నేర్పిన రాఘవ మాస్టారు, ప్రతి మాస శివరాత్రికి అభిషేకాలు,ఆ పక్కనే విష్ణాలయం,అక్కడ తిన్న వేడి వేడి ప్రసాదాలు,యేడో నెలలోనే పుట్టిన మన రాముని అమ్మ  ప్రాణానికి  ప్రాణంగా పెంచుకున్న రోజులు ,ఈ ఇంటితో ముడిపడిన మధుర స్మృతులేన్నెన్ని'

పెరట్లో కలియ తిరుగుతూ,నిశ్శబ్ద తరంగాల్లా జ్యాపకాలు మనసులో ప్రవహిస్తుండగా అమ్మ వాడిన రుబ్బురోలుని ఆప్యాయంగా సృజించాను. వీడ్కోలు చెప్పి రాము ఇంటికి బయలుదేరాం.

'బయటివాళ్ళకి ఇంటిని అమ్మకుండా మనమే తలో కాస్త డబ్బు వేసుకుని ఈ ఇల్లు కొనుక్కోవలసింది అక్కా. చాలా పొరపాటు చేసామని ఇప్పుడనిపిస్తోంది.కానీ అప్పుడు మా ఆయన అసలు కుదరదనేశారు' దోవలో వెళుతుంటే మమత బాధగా అంది.

'ఇప్పుడవన్నీ అనుకోని ఏమి లాభం?వ్యాపారంలో నష్టాలొచ్చి నేను అవసరాల్లో ఉన్నపుడు నన్నెవరూ అదుకోలేదు' కొంచెం కినుకుగా నా వంక చూస్తు రాము అన్నాడు.

వాడి మనస్సులో భావం నా కర్ధమవుతుండగా,

'మరిదిగారు యే ఉదేశ్యంతో అన్నారో కాని వాస్తవానికి అయినవాళ్లు బాధల్లో,అప్పుల్లో ఉండి ఉన్న ఆస్తుల్ని అమ్ముకుంటూంటే ఎప్పుడు కొనుక్కోకూడదు. అది మనకి,వాళ్ళకి మధ్య ఇంకా అగాధాలు సృష్టించేస్తుంది.మిగిలి ఉన్న బంధాల్ని భవిషత్తులో పూర్తిగా తుంచేస్తుంది. అయినా అప్పుడు ఇల్లమ్మితేనే కదా వాడి అప్పులు తీరిపోయి,కొత్త వ్యాపారానికి మళ్ళీ పెట్టుబడి వచ్చింది. ఇప్పుడు అన్ని కలిసివచ్చి రాము చక్కగా నిలదొక్కుకున్నాడు. ఈ రోజుకి మన ఇంటి ప్రసాదమే తింటూ అమ్మ,నాన్నఆశీసులు వాడు అందుకుంటూనే ఉన్నాడు. అయినా వాడు ఎక్కడుంటే అదే మనకు పుట్టినిల్లు.'పెద్దరికంగా అన్నాను.

శ్యామల కళ్ళలో రకరకాల భావాలు ప్రతిఫలించాయి.

'ఈ ఇంటితో అంతటి అనుభందం మనకు ముడి పడిఉండటం వల్లే మనసు ఇంకా పీకుతూ ఉంటుంది. ఎప్పుడైనా సరే నాకు ఎందుకో తరువాత నాన్న కట్టిన డాబా ఇల్లు ఎప్పుడు గురుతుకు రాదు.పాత మండువా ఇల్లే తరచు కలలో కూడా మెదులుతుంది.' మమత ఉద్వేగంగా అంది .

'నాకు కూడా నీకులాగ రెండు కలలు తరచుగా వస్తాయి' నవ్వేస్తూ అన్నాను.

'ఏంటి దొడ్డ?' రచన ఆసక్తిగా అడిగింది.

'మేము చిన్నపిల్లల్లా మండువా చుట్టూ చిన్నతనంలో ఆడుకున్న దొంగాటలు మళ్ళీ ఇప్పుడు ఆడుకొన్నట్లు కల వస్తుంది.'

ఆటలు అనగానే పిల్లలు ముసిముసి నవ్వులు నవ్వారు.ఆ కల్మషం లేని నవ్వుల వంక చూస్తూ.

'నేను రైలుస్టేషనుకి వెళ్ళగానే రైలు వెళ్ళిపోయినట్టు , ఒంటరిగా ప్లాట్ఫారం మీద ఉండిపోయినట్టుగా కూడా తరచుగా ఇంకో కల వస్తుంది'

'అత్తయ్య,ఇంతకీ రెండో కల అర్థం ఏమిటో?'స్వాతి ఉత్సుకతతో అంది.

'ఏమో,మా సైకాలజి  డాక్టర్ రచన చెప్పాలి' కొంటెగా అన్నాను.

'పేషెంట్ గతాన్ని గురించి కొంచెం వివరంగా చెబితే అప్పుడు ఈ డాక్టరుగారు లోతుగా విశ్లేషిస్తారు' పెదాల మాటున చిరునవ్వును అదిమిపెట్టుకుంటూ రచన గంభీరంగా అంది.

'ప్రతి వేసవి సెలవలకు మా అమ్మమ్మ ఇంటికి వెళ్ళినప్పుడు మా బళ్ళు తెరుస్తారని వెళ్ళిపోవాలని మా అమ్మ ఎంత  చెప్పినా కూడా మామయ్యలు తిరుగు రైలు టికెట్లు తీసేవాళ్ళు కాదు.

వాళ్ళు సాయంత్రం ఇంటికి  చేరగానే ప్రతి రోజు 'రైలు టికెట్స్ దొరికాయా'అని అమ్మ మావయ్యలను అడిగేది.

తడబాటు పడుతూ'లేదే బుల్లి, దొరకలేదు' అనేవాళ్ళు.మర్నాడు అడిగినా అదే జవాబు ఉండేది. ముద్దుల చెల్లెలిని, మమ్మల్ని మా ఇంటికి తిరిగి పంపడం ఇష్టం లేక ఏదో ఒక వంక చెప్పేవాళ్ళు. అలా పది పదిహేను రోజులు మా అమ్మ చేత,మా చేత బతిమాలించుకొని, బతిమాలించుకొని మావయ్యలు అప్పుడు అయిష్టంగా టికెట్స్ తీసేవాళ్ళు.

మేము రిక్షాల్లో ప్రయాణమై రైల్  స్టేషనుకి వెళుతుంటే అమ్మమ్మతో సహా అందరూ అరుగుల మీద కూర్చుని ఏడుస్తూ కూర్చునేవాళ్లు. ఇంటికి వచ్చాక కూడా అక్కడ ఆడుకున్నఆటలు,అందరి వెర్రి ప్రేమలు,ఎల్లలు లేని ఆపేక్షలు గుర్తుకు వచ్చి మేము కూడా చాలా రోజులు వరకు బాధతో ఏడుస్తూనే ఉండేవాళ్ళం.

అవ్వన్నీ నా మనసు పొరల్లో లోలోపల ఉండిపోయాయేమో తెలియదు కానీ ఎప్పుడు నేను టికెట్ దొరకక ఇటు అటు పరుగెడుతున్నట్టు రైలు ఆగకుండా వెళిపోతున్నట్టు,ఒంటరిగా ప్లాటుఫారమ్ మీద నిస్సహాయంగా

నిలబడిపోయినట్టు కల వస్తుంది.భయంతో ఉలిక్కిపడి నిద్ర లేస్తాను.ఇంకా తరువాత నిద్రే పట్టదు. ఏదో బెంగగా,బాధగా ఉంటుంది' అన్నాను.

అందరు నా మాటల్ని నిశబ్దంగా  వింటూ ఉండిపోయారు. గత స్మృతులతో రాము కళ్ళలో నీళ్ళు అలలుగా కదలడం కనిపించాయి.

'ఒక కల ఆనందాన్ని పంచితే మరో కల నీకు విషాదాన్ని కలిగిస్తోంది.దొడ్డా. ఇక నీతోనే ఉంటానుగా.ఇంకొంచం స్టడీ చేసి చెబుతాను.' రచన కారు మలుపు తిప్పుతూ అంది.

'అసలా ఆ రోజులే వేరు.అప్పట్లో సెల్లు, ఇంటర్నెట్లు  ఏవి లేవు కదా, ఉత్తరాలు ఒకటే ఆధారం. ఊరు నించి బామ్మ ఉత్తరం రాగానే అందరు కళ్లింత  చేసుకుని చదివేవాళ్ళం. అమ్మమ్మ ఇంటినుంచి ఉత్తరం వచ్చింది అంటే అమ్మతో సహా అందరం సంతోషంతో గెంతులు వేసేవాళ్ళం. మళ్ళీ ఆ రోజు కా రోజే ఇన్లాండ్ కవర్లో జవాబు రాసి పోస్ట్ చేసే వాళ్ళం. తాతయ్యకి,అమ్మమ్మకి ,అత్తయ్యలకి తలో పేరా అమ్మ రాసేది.కింద మేము బావలకు,వదినకు ఇంకో పేరా వ్రాస్తే, నాన్న ఏమో మావయ్యలను కుశల ప్రశ్నలడుగుతూ  ముగించేవాళ్ళు' కళ్ళు మిలమిల మెరుస్తుండగా మమత అంది.

'ఇన్లాండ్ లెటర్ లో పోస్ట్ వాహ్ 'అంది రచన.

'అక్కా నీకు గుర్తుందా,మన ఇంట్లో పోస్ట్ గూడు ఉండేది.అందులో కార్డ్సలు,ఇన్లాండ్ కవర్లు,ఇన్వెలోప్ లు ఇంకా రెవిన్యూ స్టాంపులు అన్ని నిలువ ఉండేవి.'ఈ లోకంలోకి తిరిగి వస్తు అన్నాడు రాము. చిన్నగా నవ్వాను.

'అదే  కాదు, ఉత్తరాల గుత్తి కూడా ఉండేది కదరా అన్నయ్య ,ఆ ఇనుప గుత్తిలో వచ్చిన ఉత్తరాలన్నీ పొందికగా గుచ్చి కిటికీకి వేలాడ దీసుకునేవాళ్ళం.అపురూపంగా మళ్ళీ మళ్ళీ చదువుకునే వాళ్ళం కాదరా.పాపం మన పిల్లలికి అవి తెలియవు'

'ఇంటరెస్టింగ్ ' సూర్య కళ్ళింత చేసుకుని అన్నాడు.

'వావ్, రియల్లీ ' ఆశ్చర్యంతో ఎగిరి ఎగిరి  పడుతూ అంది స్వాతి.

'పాత పెళ్లి కార్డులు దగర్నుంచి పోస్ట్ కార్డుల దాక అన్ని జాగర్తగా దాచుకునే వాళ్ళం. తీరిక దొరికినప్పుడల్లా అన్ని పోగేసుకొని మళ్లీ మళ్లీ ఆ జ్ఞాపకాలను కదిలించుకొనేవాళ్ళం .నా పెళ్ళయ్యాక మా అత్తారింట్లో నేను ఎలా మసలుకోవాలో జాగ్రత్తలు చెబుతూ అమ్మమ్మ రాసిన ఉత్తరాలు కూడా ఇంకా నా దగ్గర ఉన్నాయి' అంది మమత.

'ఇన్నాళ్లు దాచావా' రామకృష్ణ తన వంక ఆశ్యర్యంగా చూస్తూ అన్నాడు.

'చాలామంది వయసు పెరుగుతున్న కొలది తమలోని ఆర్ధతని,సున్నితత్వాన్ని బయటికి నెట్టేసి కల్మశంగా మారిపోతుంటారు. నీలో ప్రేమ,మమకారం పాటుగా అన్ని అలాగే నిలిచి ఉన్నాయి.నువ్వు అప్పటికి ఇప్పటికి ఒకలాగే ఉన్నావు మమత.' ఆప్యాయంగా అన్నాను.    ★★★★

ఆ వారం రోజులు రాము ఇంట్లో సరదాగా గడిచిపోయింది.పిల్లలకి వేసవి సెలవలు కావడంతో అత్తయ్య అంటూ నన్ను క్షణం వదలకుండా నాతో కలసిపోయారు.వాట్సాప్ లో, స్కైప్ లో మా వాడితో మా మనవలతో చాలాసార్లు బోలెడు కబుర్లు చెప్పుకున్నారు.

ఒక రోజు 'రాము,సాయంత్రం ఒక్కసారి రంగమ్మతయ్యని చూసి వద్దాం రా 'అన్నాను.

'మావయ్య పోయి అప్పుడే ఆరునెలలు దాటింది.ఒంటరిగా వివేకానంద వృద్ధాశ్రమంలో ఉంటోందిట.పాపం ఎలా ఉందో?' అన్నాడు.

'ఎవరు నాన్న?'స్వాతి అడిగింది.

'మా ఇంట్లో చాలకాలం అద్దెకున్నారు.మా కుటుంబ స్నేహితులు.ఆవిడ వంట చాలా అద్భుతంగా చేసేది' అన్నాడు.

'డెబ్బై ఏళ్ళు పైనే ఉంటాయేమో.మన ఇంటికి రెండు మూడుసార్లు వచ్చారు కదండీ' గుర్తు చేస్కుంటూ శ్యామల అంది.

'పాపం, ఎదుగు బోదుగు లేని జీవితం వదినా.మావయ్యది చిన్న ఉద్యోగం.నలుగురు పిల్లలు.అప్పుడప్పుడు డబ్బు సాయమే కాకుండా స్థలంలో కాసిన కూరగాయలు,ఇంట్లో చేసిన పచ్చడులు దగ్గరనుంచి అన్ని అమ్మ వాళ్ళకి ఇస్తూండేది.పెళ్లిళ్లు కాగానే వాళ్ళ పిల్లలు వీళ్ళను వదిలేసి తలా చోటికి ఎగిరిపోయారు.ఇద్దరు వంట పనులకు వెళ్ళుతూ ఏదో ఇప్పటి వరకు లాగించారు.ఇంతలో మావయ్య పోయారు'మమత ఆవేదనగా అంది.

★★★

ఆశ్రమానికి వెళ్ళేటప్పటికి రంగమ్మత్తయ్య వంటశాలలో వంటవాళ్ళకు సూచనలు ఇస్తూ చాలా ఉత్సాహంగా కనిపించింది.బోసి నవ్వుతో  అందరిని పేరు పేరునా పలకరించి పిల్లలిని దగ్గరికి తీసుకుని ప్రేమగా ముద్దాడింది.

కాసేపు మాటలు అయ్యాక 'కన్నపిల్లలు ఆదుకోలేదు కానీ ఏ పాశమో నీది,నీ వల్లే ఇంత ముద్ద తిని ఇలా బతికేస్తున్నాను' నా వంక చూస్తూ కళ్ళలో నీళ్లు జలజలరాలుతుండగా అంది.

ఆవిడ భుజం తట్టి 'నేను కాదు అత్తయ్య. పైన ఆ దేముడు వల్ల.అందరిని ఆయనే చల్లగా చూస్తాడు.ఇలాగే ఎప్పుడు ధైర్యంగా, సంతోషంగా ఉండు' వేలితో పైకి చూపిస్తూ అన్నాను.

'దేముడు కాదు,దేవతలా నువ్వే నన్నుఆదుకున్నావు'నా చేతుల్ని ఆప్యాయంగా పట్టుకుంటూ అంది.

రామకృష్ణ, శ్యామల ఒకరి ముఖాలను ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

'ఏమిటి రాసావు అత్తయ్య.' ఇంతలో ఫాను గాలికి ఎగిరి కింద పడిన కాగితాలన్ని ఏరి బల్ల మీద పెడుతూ మమత అడిగింది.

కొంచం సిగ్గుగా నవ్వుతూ,'వంటల పుస్తకం రాస్తున్నాను.ఈ మధ్యన టీవీలో కూడా నా వంటల కార్యక్రమాలు కొన్ని ప్రసారం అయ్యాయి' అంది. ఆవిడ ముఖంలో వానప్రస్తపు జీవితంలో మొలకెతిన కొత్త చిగుళ్ళ సంతోషపు మెరుపులు తొంగి చూసాయి.

మనసారా అభినందించి ఆశ్రమం నుంచి బయటికి వచ్చాక 'ఏంటక్కా, నువ్వు అత్తయ్యను ఇక్కడ చేర్పించావా?' రామకృష్ణ నా వంక నమ్మలేన్నట్టుగా చూస్తూ అడిగాడు.

'మావయ్య పోయారనగానే చాలా భాధనిపించిందిరా. ఇప్పటివరకు ఇద్దరు కలిసి ఏదో జీవితాన్ని గడిపేసుకుంటున్నారు.పాపం ఇక పైన ఇంత ముసలి వయసులో అత్తయ్య ఒంటరిగా ఎలా బతుకుతుంది?ఈ మలివయసులో మావయ్య లేని లోటు బాధాకరమైనదైనా,ఊపిరి ఉన్నంత వరకు అత్తయ్య జీవితమైతే నడవాలి కదా.ఈ కొత్త వాతావరణంలో ఎలా గడుపుకుంటుందో అని ముందు నేను కొద్దిగా భయ పడ్డాను కానీ చూస్తుంటే బాగానే ఇమిడిపోయిందనిపిస్తోంది. వండి పెడుతూ బాగానే కాలక్షేపం చేస్తోంది.'

'అయినవాళ్ళు ఆదరించకపోతే వృద్ధాప్యం పెద్ద శాపమే' అంది మమత.

'అవును.నిజానికి ఎవరికైనా వయసు మీరాక డబ్బు,సౌకర్యాలు కావాలనిపించదు.వయసులో ఉన్నపుడే ఆ ఆరాటలన్నీ మనిషిని పరుగుపందెం పెట్టిస్తాయి.వృద్ధాప్యంలో పలకరించే మనుషులే కావాలనిపిస్తారు.ఎంత ఆదరంగా చూసినా కూడా నేను  పిల్లల దగ్గర బొత్తిగా తోచక అసలు అక్కడ ఉండలేకపోతున్నాను.ఆశ్రమంలో యే లోటు లేకుండా గడచి పోతుందని రంగమ్మతయ్య అంటుంది కానీ దాని కన్నా మనము చూడటానికి వచ్చామన్న ఆనందపు అనుభూతే ఆవిడకీ కోట్ల విలువైనది.అది చాలా రోజులు అత్తయ్యలో నిలిచి ఉంటుంది.'

'దొడ్డ.నువ్వు చెప్పింది వంద శాతం కరెక్ట్' రచన కళ్ళలో అభినందన మెరుపు మెరిసింది.

'అందుకే మనమెవరిమైనా,ఎంత దూరాల్లో ఉన్నా,పెద్దవాళ్ళు బ్రతికున్నపుడు ఫోన్లోనో, స్వయంగానో వెళ్ళా ఎలా ఉన్నారని ఆప్యాయంగా మనసారా పలకరించాలి కానీ,వాళ్ళు పోయారన్న కబురు తెలిసాక మటుకు హడావుడిగా వెళ్లి గుంపులో గోవిందా అన్నట్టు హాజరు వేయించుకొని మమ అనిపిస్తే,మనం మనషులమేనా అనిపిస్తోంది.మావయ్య చనిపోయాక వాళ్ళ పిల్లలు వచ్చి కార్యక్రమాలు జరిపిస్తుంటే నాకు ఇంకా చాలా కోపంగా అనిపించింది.బతికి ఉండగా పట్టించుకోలేదు కాని పోయాకా దినాలు మటుకు ఘనంగా చేసారు' మంటగా అంది మమత.

'మన అమ్మ,నాన్నలు మనకి నేర్పిన సంస్కారాన్ని పాటించాలి.కాని ఇప్పుడందరూ డబ్బు సంపాదించడం కోసం పోటిలు పడుతూ పిల్లలికి ఉన్నతమైన చదువులు చెప్పిస్తూన్నారు కాని మంచి సంస్కారాన్ని నేర్పడాన్ని వదిలేస్తున్నారు.' అన్నాను.

‘అందరు మనుషులు ఒకలా ఉండరు కదా దొడ్డ.మన చేతివేళ్ళే ఒకలాగా ఉండవు.అమ్మమ్మ లాగే మీ అత్తయ్య కూడా వాళ్ళ పిల్లలిని ఎంతో ప్రేమగానే పెంచి ఉంటుంది కదా.మరి మీ కుటుంబమంతా ఒక మాటగా మసులుకున్నారు కదా?మరి అదే మీ అత్తయ్య పిల్లలు వీళ్ళని గాలికి వదిలేసి దూరమైపోయారు.పరిస్థితుల పట్టి మనుషులు మారతారు.చేతలు మారతాయి.మనకి ఒప్పుగా అనిపించింది అందరికి ఒప్పుగా కనపడకపోవచ్చు కదా’

రచన మాటల వెనుక ఉన్న లోతైన ఆలోచనలు నా హృదయాన్ని కాదు రాము హృదయాన్ని సున్నితంగా తాకాయనిపించింది నాకు.

★★★

రాము ఇంట్లో ఉన్న రోజులన్నీ సందడిగా గడిచిపోయాయి. శ్యామల క్షణం తీరిక లేకుండా హడావడి పడుతూ చాలా పిండివంటలు చేసి కొసరి కొసరి ప్రేమగా వడ్డించి అమ్మ లేని లోటు కనపడకుండా చేసింది.

అదే మాట తనతో అన్నాను ‘నిన్ను చాలా శ్రమ పెడుతున్నాను’ అంటూ.

‘అదేమీ మాట వదిన.మీరు ఇన్నేళ్ల తరువాత వచ్చారు.మాకదే సంతోషం.ఆడపిల్లలకి పెళ్లిళ్లయిపోయి ఎంత పెద్దవాళ్లపోయినా,వాళ్ళకి జీవితాంతం పుట్టింటి మీద హక్కు ఉంటుంది.మీకు అక్కడ దొరకనివి,మీకిష్టమైనవన్నీ నాతో చెప్పి మరీ చేయించుకోండి.ఇది మీ ఇల్లండి బాబు.’ నవ్వుతూ అంది.

ఆమె నిండుమాటలకి మనసంతా ఆనందంతో నిండిపోగా నా కళ్లలో నీళ్ళు తిరిగాయి. పక్కన కూర్చున్న రాము మా మాటలను ఆలోచనగా వింటున్నాడు.

‘వదిన, ఇంకొక మాట. న్యాయానికి అమ్మిన ఇంటి మీద ఆడపిల్లగా మీకు రావాల్సిన వాటా అప్పటి మా పరిస్థుతుల వల్ల ఇవ్వలేక పోయాము. ఇప్పుడిప్పుడే కాస్త ఒడ్డున పడుతున్నాము. ఎప్పటికైనా అణా పైసలతో సహా మీకు తిరిగి ఇచేస్తాము’ అంది.

ఆప్యాయంగా శ్యామల చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుంటూ అన్నాను.

‘శ్యాము,మీ కష్టం నాది కాదా ఏంటి? ఇంటిని కాపాడుకోలేకపోయానన్న బాధ నన్ను వీడదు.కాని మీ కొండంత అప్పుకి నేను చేయగలిగే సాయం గోరంతే అవుతుందని నిస్సహాయంగా ఆగిపోయాను.’ నా కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

సంబాళించుకుంటూ ‘అయినా ఏంటి, ఇప్పుడేగా ఇది మీ ఇల్లు అన్నావు.అంతలోనే నన్ను పరాయిదాన్ని చేస్తున్నావు.నాకు మీరు ఒక్క రూపాయి కూడా ఇవ్వన్నక్కర్లేదు.ఎప్పుడొచ్చినా దోసిలి నిండా పసుపు,కుంకుమలతో నా కొంగు నింపి నన్ను నా పుట్టింటి నుంచి సాగ నంపితే నాకంతే చాలు’ భావోద్వేగంగా అన్నాను.

‘అక్కా,నన్ను క్షమించు.మీరంతా వద్దంటున్నా వినకుండా చేస్తున్న మంచి ఉద్యోగాన్ని వదిలేసి మూర్ఖంగా వ్యాపారాన్ని మొదలు పెట్టాను. చివరికి అప్పుల పాలై, వ్యాపారనష్టంతో కృంగిపోయి తప్పనిసరి పరిస్థితులలో మన ఇల్లు

అమ్మాల్సి వచ్చింది.అమ్మినప్పుడు అప్పటికప్పుడు మన ఇంటికి అంత ధర ఎలా పలికిందా అని ఆశ్చర్యపడ్డాను కాని అందులో నువ్వు కలిపిన  ఆకాశమంత సాయం ఉందని తెలుసుకోలేని గుడ్డివాడినయ్యాను.నాకు ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుచుకుంటున్నాయి' రాము నా రెండు చేతులు పట్టుకుని చిన్నపిల్లాడిలా వలవలా ఏడ్చాడు.అతని మాటలకు మమత,శ్యామల ఆశ్చర్యంతో తలమునకలు అయ్యారు.

★★★

నేను యూకె తిరిగి వెళ్లే రోజు, వీడ్కోలు చెప్పి బాగ్యులను హాల్లోకి చేరుస్తుంటే,

'వదిన, ఒక్క నిముషం ఉండండి.అనుకుంటూనే ఉన్నాను. ఆఖరులో పెట్టుకుందామన్న ఫ్రిడ్జి లో పెట్టిన పచ్చళ్ళ ప్యాకెట్  మర్చే పోయారు' తలకొట్టుకుంటూ శ్యామల లోపలి వెళ్లి తెస్తుండగా రామకృష్ణ  ఆమె చేతి నుంచి అందుకుని గబాగబా బాగ్లో సర్దేసాడు. వాళ్ళిద్దరిని చూస్తుంటే మా అత్తయ్యా,మావయ్యల రూపాలు నా కళ్ళ ముందు తళ్ళుక్కుమని మెరిశాయి.

'అత్తయ్య' నా చేయి పట్టుకుని అంది స్వాతి.

'చెప్పు చిట్టి తల్లి' ఆప్యాయంగా అన్నాను.

నా పక్కన కూర్చుంటు,

'మీ చిన్నపుడు మీ మావయ్య వాళ్ళు ' టికెట్ దొరకలేదు ' అంటే మీరు చాల రోజులు మీ ఊళ్ళో ఉండిపోయేవాళ్లు అన్నావు కదా, ఇప్పుడు నువ్వు 'ఫ్లైట్ టికెట్ దొరకలేదు' అని మావయ్యకి చెప్పి ,ఇక్కడే ఉండిపో అత్తయ్యా, నువ్వు వెళ్ళవద్దు.' బెంగగా అంది.

దాని ముఖంలో మా అమ్మ రూపం కనిపించి కన్నీళ్లతో నా చెంప తడిసిపోయింది .

దగ్గరికి తీసుకోని 'మళ్ళీ త్వరలో వస్తానుగా' గద్గదికంగా అన్నాను.

'అత్తా' మెడ చుట్టూ చేయీ వేసి ఒళ్ళో కూర్చున్న సూర్య కన్నీళ్ళు నా మెడని తడుపుతుండగా,

'అర్ధంలేని మనస్తాపంతో మీ అందరి ప్రేమల్ని ఇన్ని సంవత్సరాలు దూరం చేసుకుని ఎంత పొరపాటు చేసానో ఇప్పుడిప్పుడే గ్రహింపుకు వస్తోంది కన్నా' వాడ్ని గట్టిగా హత్తుకుంటూ అన్నాను.

మమత కన్నీళ్ళు తుడుచుకుంటూ నా భుజం మీద తలవాల్చింది.

'దొడ్డ, అమ్మమ్మ,తాతయ్య వెంటవెంటనే చనిపోవడంతో ఒంటరివయ్యావని బాధపడుతున్నావు.అదీకాక నీకు అమ్మకు,రాము మావయ్యకు మధ్య దూరాలు పెరిగిపోయి ఇంకా ఎక్కువగా దిగులుపడిపోతున్నావు కాబట్టే  నీకు రోజు అలాంటి కలలు వస్తున్నాయి. ఇప్పుదందరిని కలిసావు కదా.ఇక నీకు అలాంటి కలలు రావులే.మన అందరం ఒకే కుటుంబం. దొడ్డా,శాశ్వతంగా త్వరగా వెనక్కి వచ్చేయి.మేమందరమూ నిన్ను బాగా చూసుకుంటాము.నీ రాక కోసం అందరమూ వెయ్యికళ్ళతో ఎదురుచూస్తూ ఉంటాము.బ్యాక్ హోమ్ దొడ్డా' ఆర్ద్రతతో అంది రచన.

ఆ మాటలకి కదిలిపోయాను.

'నువ్వింటికి పెద్దదానివి.నేనున్నా లేకపోయినా మన కుటుంబాన్నిఎప్పుడు వదలకూడదంటూ' నాన్న తన చేతిలో నా చేయి వేయించుకున్న ప్రమాణాన్ని రచన మళ్ళీ మా నాన్నలా నాకు గురుతు చేసింది.

'బంధాలు బలహీనమయ్యాయని ఎప్పుడు వదిలేయకూడదు.ప్రేమ తాళ్లు ముడి వేస్తూనే ఉండాలి. ఎన్నేళ్లకైనా,ఎప్పటికైనా ఆవే  బలపడతాయి.తాగడానికి పనికి రాని నీటికి  కూడా మొక్కలని చెట్లుగా మార్చే శక్తి ఉంటుంది.'

ఉమ్మటింట్లో చిన్న చిన్న గొడవలు చెలరేగుతుంటే,సమర్ధవంతగా అన్నిటిని సర్దుబాటు చేస్తూ,వేసవి సెలవల్లో నన్ను పక్కగా కూర్చో పెట్టుకుని రాత్రి వేళ చల్లటి సముద్రపు గాలి వీస్తుంటే మడతమంచం మీద తెల్లటి పక్క మీద పడుకుని పెదమావయ్య అప్పుడు చెప్పిన మాటలు మళ్ళీ ఇప్పుడు నా చెవిలో ప్రతిధ్వనించాయి .

గుండె బరువయ్యింది.అభిమానం సముద్రమైంది.ఆదరణ ఆకాశమైంది.అందరు అప్యాయంగా నన్ను చుట్టూ ముట్టగా ఏ మనిషికైనా జీవితంలో ఇంతకన్నా ఇంకేం కావాలి ?భావోద్వేగంతో హృదయం నిండిపోయింది.ప్రేమ అనంతమైంది ఎల్లలు లేనిది అనిపించింది.

కారు మలుపు తిరుగుతుంటే వెనక్కి తిరిగి చూస్తే,తాతగారి అరుగు మీద ఉమ్మడి కుటుంబంలో అందరు చెప్పే వీడ్కోలు, అమ్మ,నాన్న ఇంటి వెనుక తోట వైపు నిలబడి చెప్పే వీడ్కోలు,ఇప్పుడు తమ్ముడు ,చెల్లెలు కుటుంబాలతో చెబుతున్న  వీడ్కోలులో మూడు తరాల మమకారాలు,మమతలు పిల్ల తెమ్మెరలా నన్ను సున్నితంగా స్పృజిస్తూ త్వరగా వెన్నక్కి వచ్చేయమన్న ప్రేమ సందేశాన్ని పంపుతూ ఆడపిల్లనయినా కూడా ఇంటికి పెద్దదానిగా నా ఆకాశమంత బాధ్యతలని ఎప్పటికి మరువకూడదని గుర్తు చేస్తూనే ఉన్నాయి.

COMMENTS